ఆంధ్రజ్యోతి

5



తమిళనాడు
TAMILNADU

మంగళవారం 6 మే 2025

ముగిసిన భారతి దాసన్

జయంతి వేడుకలు

● ఐదుగురి రచనలు జాతికి అంకితం ● వారసులకు తలా రూ.10లక్షలు అందజేసిన సీఎం

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): మహాకవి భారతీయార్ తర్వాత తమిళ విప్లవకవిగా పేరొందిన భారతిదాసన్ జయంతి వేడుకలు అట్టహాసంగా ముగిశాయి. ఈ యేడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం తరఫున భారతి దాసన్ జయంతి వేడుకలను 'తమిళ వారోత్సవాలు'గా జరుపనున్నట్లు ఇటీవల శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మేరకు మార్చి 29న ప్రారంభమైన ఈ వేడుకలు సోమవారంతో ఉదయం ముగిశాయి. ఆ సందర్భంగా పౌరసంబంధాల శాఖ, సాంస్కృతిక శాఖ సహా పలు శాఖల ఆధ్వర్యంలో కవిత, సాహితీ సదస్సులు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, కవితా పోటీలు నిర్వహించారు. ఆ పోటీ విజేతలకు చేపాక్ కలైవానర్ అరంగంలో జరిగిన ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు, ప్రముఖ రచయితలు, కవు లు, పండితులు, కళాకారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా తమిళుల సంస్కృతి, పోరాట పటిమను ఎలుగెత్తి చాటేలా భారతిదాసన్ రచించిన పాటలతో 'సంగే ముళంగు' పేరుతో నృత్యకళాకారులు నాట్య ప్రదర్శన చేశారు. రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ అధ్యక్షుడు దిండుగల్ లియోని నాయకత్వంలో భారతిదాసన్ రచనల వైశిష్టంపై పట్టిమండ్రం (చర్చా వేదిక) నిర్వహించారు. ఆ తర్వాత స్టాలిన్ తమిళభాష ఔన్నత్యాన్ని తెలిపే డాక్యుమెంటరీని ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలనంతరం జరిగిన సభలో 'కవికో' అబ్దుల్ రహ్మాన్, రచయితలు మెర్విన్, ఎ.పళని రచనలను జాతికి అంకితం చేసినందుకుగాను వారి వారసులకు తలా రూ.10లక్షల చొప్పున ముఖ్యమంత్రి స్టాలిన్ ఆర్థికసాయం అందజేశారు. ఇదే విధంగా కేఎం కొదండం, ఆచార్య ఇల్మా తమిళనావన్ రచనలను జాతికి అంకితమిచ్చి నందున వారి వారసులకు రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయా న్ని స్టాలిన్ అందజేశారు. చివరగా తమిళ వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు కూడా ఆయన బహుమతులు ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, ఎంపీ సామినాథన్, ఆర్ఎస్ రాజకన్నప్పన్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ ఎంకే మోహన్, శాసనసభ్యులు ఇ. పరంధామన్, తాయగం కవి, డి.వేలు, జోసెఫ్ సామువేల్, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ నేత కేఎం ఖాదర్ మొయిద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పర్యాటక దేవాదాయశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, ప్రపంచ తమిళ పరిశోధనా సంస్థ అధ్యక్షులు ఆర్.బాలకృష్ణన్, సమాచార పౌరసంబంధాల శాఖ కార్యదర్శి వి.రాజారామన్, సంచాలకులు డాక్టర్ ఇరా వైద్యనాథన్ తదితరులు పాల్గొన్నారు.



రచనలను జాతికి అంకితం చేసేందుకు అంగీకరించిన వారసులకు తలా రూ.10లక్షల చెక్ అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

డెల్టా జిల్లాల్లో భారీ వర్షం

● చేతికొచ్చిన పంట వర్షార్పణం ● అన్నదాతకు అపార నష్టం

అడయార్, మే 5 (ఆంధ్రజ్యోతి): డెల్టా జిల్లాల్లో సోమవారం కూడా ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా తిరుచ్చి, పెరంబలూరు, సేలం, నామక్కల్ తదితర జిల్లాల్లో వర్షం ముంచెత్తింది. తూర్పు, పశ్చిమ గాలులు దిశ తరచూ మారిపోతుండటంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఆదివారం మరోవైపు వాతావరణంలో ఉన్నట్టుండి మార్పులు సంభవించడంతో ఆకాశంలో మేఘాలు అలముకుని ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది.. తిరుచ్చిలో ఉదయం నుంచే సూర్యుడు ప్రతాపం చూపించాడు. సాయంత్రం ఆరు గంటలకే కారుమబ్బులు కమ్ముకుని ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. అదేవిధంగా నాగపట్టణం జిల్లాలోనూ వేదారణ్యం వేలాంకన్ని కీళ్‌వేలూరు తదితర ప్రాంతాల్లో రాత్రి 10 గంటల సమయంలో వర్షం కురిసింది. మైలాడుదురై జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు భారీ వర్షం కురిసింది. తంజావూరు జిల్లాలో తంజావూరు, కుంభకోణం, తిరువైయారు, వల్లం, పాపనాశం, ఒరత్తనాడు తదితర ప్రాంతాల్లో సోమవారం రాత్రి తేలికపాటి జల్లులు కురిశాయి. కరూర్, కృష్ణరాయపురం, కడవూరు, కుళిత్తలై తదితర ప్రాంతా ల్లో రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు భారీవర్షం కురిసింది. పెరంబలూరు జిల్లాలో పెరంబలూరు, చొక్కనాథపురం, ఆలంపట్టి, రంగనాథపురం, అరణారై తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.



పంట నీటిపాలు...

తిరువళ్ళూరు జిల్లా ఊత్తుకోటతో పాటు పరిసర ప్రాంతాల్లో విస్తారంగా వర్షం పడింది. దీంతో ఊత్తుకోట, పాలవాక్కం, తారాట్చి, తొంబరంపాడు, పాలవాక్కం, పెందవాక్కం, పెరింజేరి పెరియపాళెయం, అరియప్పాక్కం, తండలం తదితర గ్రామాల్లోని వరిపంట వర్షం కారణంగా నీట మునిగింది. వర్షాలకు చేతికొచ్చిన పంట నీటిపాలైందని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలంటూ రైతులు ప్రాధేయపడుతున్నారు.

తాళిని తొలగించి పరీక్షకు పంపిస్తారా?

● ఇది చరిత్ర క్షమించని హేయమైన చర్య

● నీట్ నిబంధనలపై మంత్రి సుబ్రమణ్యం ఆగ్రహం

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): నీట్‌కు హాజరయ్యే విద్యార్థులను తనిఖీల పేరుతో చిత్రహింసలకు గురిచేసి, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయటం గర్హనీయమని, వివాహితుల మెడలోని మంగళసూత్రాలను వారి భర్తల ఎదుటే తొలగించి పరీక్షకు అనుమతించడం క్షమించరాని చర్య అని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన వేడుకల్లో భాగంగా డీఎంకే స్థానిక శాఖల ఆధ్వర్యంలో యేడాది పొడవునా నిరుపేదలకు ఉదయం అల్పాహారం అందించే 'అన్నం తరుమ్ అముదకరంగళ్' (అన్నంప్రసాదించే అమృతహస్తాలు) పథకం అమలులో భాగంగా కొళత్తూరులో పేదలకు అల్పాహారం పంపిణీ కార్యక్రమంలో దేవాదాయ శాఖమంత్రి పీకే శేఖర్ బాబుతోపాటు ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... నీట్ ప్రవేశపెట్టినప్పటి నుండి పలు వివాదాలు జరుగుతున్నాయని, పరీక్షల నిర్వహణలో జరిగిన తప్పిదాలపై సుప్రీంకోర్టు పలుమార్లు కేంద్రంపై విమర్శలు చేసిందని, వీటికి తోడు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను దొంగలను తనిఖీ చేసే విధంగా తనిఖీ చేయడం, చొక్కాలను విప్పమని చెప్పటం మరో చొక్కా వేసుకురమ్మని చివరిక్షణంలో చెప్పటం, విద్యార్థినుల స్టిక్కర్ బొట్లను, నగలను తొలగించడం ఇలా చిత్రహింసలు పెడుతున్నారని, ఈ తనిఖీల కారణంగా పరీక్షలు రాయడానికి వచ్చిన అభ్యర్థులే కాకుండా వారి తల్లిదండ్రులు సైతం నీట్ అంటే ఏవగించుకుంటున్నారని చెప్పారు. 'నీట్ నీట్‌గా (సాఫీగా) జరగటం లేదని విద్యావేత్తలు సైతం చెబుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో నీట్ కారణంగా 40 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా మాజీ గవర్నర్ తమిళిసై నీట్ చాలా ప్రశాంతంగా జరిగిందని చెప్పటం గర్హనీయమన్నారు.



కొళత్తూరులో అల్పాహారం పంపిణీ చేస్తున్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం

ఉత్తరాదిలో కాపీ కొడుతున్నారు: సీమాన్

రాష్ట్రంలోనే నీట్‌కు వెళ్లే అభ్యర్థులందరినీ తనిఖీల పేరుతో వేధింపులకు గురిచేసి, ఆ పరీక్షలంటేనే భయపడేలా చేస్తున్నారని, ఉత్తరాది రాష్ట్రాల్లో ఇలాంటి తనిఖీలే లేవని, అభ్యర్థులంతా దర్జాగా పుస్తకాలు పట్టుకుని కాపీ కొట్టి మరీ నీట్ పరీక్షలు రాస్తున్నారని నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ ధ్వజమెత్తారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముక్కుపుడకలు, చొక్కా బటన్లలో ఎలా కాపీకొడతారో తనకు తెలియటం లేదని, మంచి చొక్కాలను సైతం కత్తిరించేశారని, అప్పటికప్పుడు వారి వద్ద కత్తెరలు సిద్ధంగా ఉండటాన్ని బట్టి ఓ పథకం ప్రకారమే ఈ వేధింపులు జరుగుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. నీట్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్వహించడం లేదని, ఓ అమెరికా సంస్థ ద్వారా చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. నీట్‌లో ఉత్తీర్ణులైతేనే వైద్యనిపుణులు పుట్టుకొస్తారనటం కూడా తప్పుడు వాదనే అని అన్నారు. నీట్ కారణంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు డాక్టర్లు కాలేకపోతున్నారన్నదే చేదు నిజమన్నారు. నీట్‌కు భయపడి అనితా అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నప్పుడు ఆ పరీక్ష రద్దు చేసే తారకమంత్రం తమకు మాత్రమే తెలుసునని, అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పిన డీఎంకే పాలకులు నీట్ తనిఖీల పేరుతో జరుగుతున్న దురాగతాలకు బాధ్యత వహించాలని సీమాన్ డిమాండ్ చేశారు.

సమాజాన్ని ప్రకాశవంతం చేసేవి 'మార్క్స్' ఆలోచనలు: సీఎం స్టాలిన్

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): సమానత్వ ప్రపంచం నిర్మించేందుకు కారల్ మార్క్స్ సిద్ధాంతం సమాజాన్ని ప్రభావితం చేస్తాయని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేసిన వివరాలిలా ఉన్నాయి... సమానత్వ ప్రపంచాన్ని నిర్మించడానికి కమ్యూనిజం సిద్ధాంతాన్ని అందించిన కారల్ మార్క్స్ జయంతిని 'అందరికీ అన్నీ' అనే ఆదర్శం యొక్క విజయోత్సవాలను జరుపుకుంటున్నాము. కార్మిక వర్గానికి మద్దతిచ్చే మార్క్స్ ఆలోచనలు ప్రోత్సహించేలా, కన్నిమరా లైబ్రరీ ప్రవేశ ద్వారం వద్ద ఆయన విగ్రహం ఏర్పాటు కోసం స్వయంగా వెళ్లి స్థల పరిశీలన చేశారు.. ప్రస్తుతం విగ్రహం ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. విగ్రహ రూపంలో నిలిచే మహానుభావుడు మార్క్స్ ఆలోచనలు మానవ సమాజాన్ని శాశ్వతంగా ప్రకాశింపజేయుగాక..! అంటూ సీఎం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

హైకోర్టుకు ఇద్దరు శాశ్వత న్యాయమూర్తులు

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పని చేసిన ఇద్దరు శాశ్వత న్యాయమూర్తులుగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఎస్.సుందర్, జస్టిస్ భవాని సుబ్బురాయన్, హేమలత, నక్కీరన్, శివజ్ఞానం ఈ నెలలో పదవీవిరమణ పొందనున్నారు. దీంతో మద్రాసు హైకోర్టులో ఖాళీ న్యాయమూర్తుల సంఖ్య 15కు పెరగనుంది. ఈ నేపథ్యంలో, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి హేమంత్ చందన గౌడ, తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి కె.సురేందర్‌లను మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులుగా బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసును రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో, మద్రాసు హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా వున్న జస్టిస్ సి.కుమరప్పన్, జస్టిస్ కె.రాజశేఖర్ శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. వారిచేత హైకోర్టు ప్రాంగణంలో సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ ప్రమాణం చేయించారు.





జస్టిస్ రాజశేఖర్, జస్టిస్ కుమరప్పన్

బోసిపోయిన కోయంబేడు

● జనసంచారం లేక నిర్మానుష్యం

ప్యారీస్, మే 5 (ఆంధ్రజ్యోతి): మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సోమవారం ఒకేరోజు నిర్వహించిన ఆరు వాణిజ్య సంఘాల మహానాడులో పాల్గొనేందు కోసం వ్యాపారాలకు సెలవు ఇవ్వడంతో ఆసియా ఖండంలోనే అతిపెద్ద హోల్‌సేల్ మార్కెట్‌గా పేరొందిన కోయంబేడు మార్కెట్ సోమవారం జనసంచారం లేక బోసిపోయింది. ఈ మార్కెట్‌కు చెందిన వందలాది మంది వ్యాపారులు తమ దుకాణాలు మూసివేయడంతో రోజు కూలీ చేసుకునే శ్రామికులు ఒకరోజు ఉపాధి కోల్పోయారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది మే 5వ తేదీ వ్యాపారుల దినోత్సవంగా జరుపుకుంటారు. ఆ రోజున వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆ రీతిలో సోమవారం వ్యాపారులంతా కలిసి 40వ వాణిజ్య వేడుకల్లో పాల్గొని ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కోయంబేడు ప్రాంతంలోని పండ్లు, కూరగాయలు, బియ్యం, పప్పుదాన్యం, కిరాణా సరుకులు విక్రయించే దుకాణాలకు ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుండి సరుకులను వేలసంఖ్యలో లారీలు తరలిస్తుంటాయి. ఈ లారీలు, చిరువ్యాపారులు, కొనుగోలుదారులతో నిత్యం కోయంబేడు మార్కెట్ రద్దీగా దర్శనమిస్తుంటుంది. అలాంటిది వ్యాపారుల వాణిజ్య దినోత్సవం సందర్భంగా జనసంచారం, వాహనాల రాకపోకలు లేక కోయంబేడు మార్కెట్ ప్రాంతం నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది.



సినీ ఫక్కీలో రూ.23కోట్ల వజ్రం దోపిడీ

● 24 గంటల్లోనే ఛేదించి, నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని హోటల్‌లో అన్నానగర్‌కు చెందిన వ్యాపారిని బంధించి రూ.23 కోట్ల విలువైన వజ్రాన్ని దోచుకెళ్ళిన నలుగురు దొంగలను ప్రత్యేక పోలీసు బృందం 24 గంటల్లోనే అరెస్టు చేసింది.. తూత్తుకుడి వద్ద కారులో పారిపోతున్న నలుగురిని అక్కడి పోలీసులు అరెస్టు చేయగా, చెన్నై నుంచి ప్రత్యేకదళం తూత్తుకుడి వెళ్ళి నలుగురిని నగరానికి తీసుకొచ్చారు. దోపిడీ చేసిన వజ్రాన్ని కూడా స్వాధీనంచేసుకున్నారు. అన్నానగర్‌కు చెందిన చంద్రశేఖర్ వజ్రాల వ్యాపారం చేస్తున్నారు. మదురైలో ఉన్న ఓ వ్యాపారి రూ.23 కోట్ల విలువైన వజ్రాన్ని చంద్రశేఖర్‌కు ఇచ్చి అమ్మిపెట్టమని అడిగారు. చంద్రశేఖర్ ఆ వజ్రాన్ని అమ్మటానికి విల్లివాక్కంకు చెందిన రాహుల్, మనలి ప్రాంతానికి చెందిన ఆరోగ్యరాజ్, సైదాపేటకు చెందిన కంబన్ అనే బ్రోకర్ల సాయం కోరారు. ఈ బ్రోకర్లు కొందరిని చంద్రశేఖర్ వద్దకు తీసుకొచ్చి వజ్రాన్ని రూ.23 కోట్లకు బేరం కుదుర్చుకున్నారు. వీలయినంత త్వరగా డబ్బులు తీసుకొస్తామని ఆ వ్యాపారులు చెప్పి వెళ్ళిపోయారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కొంతమంది బ్రోకర్లు చంద్రశేఖర్‌ను సంప్రదించి వజ్రాన్ని కొనేందుకు వ్యాపారులు డబ్బుతో సిద్ధంగా ఉన్నారని, వడపళనిలోని స్టార్ హోటల్‌కు వస్తే అమ్మకాలు పూర్తవుతాయని తెలిపారు. చంద్రశేఖర్ వారి మాట ప్రకారం తన పెంపుడు కుమార్తె జానకితో వజ్రాన్ని పెట్టెలో ఉంచుకుని ఆ స్టార్‌హోటల్‌కు వెళ్ళారు. కుమార్తెను బయటే ఉండమని చెప్పి బ్రోకర్లున్న గదిలోకి చంద్రశేఖర్ వెళ్ళాడు. అరగంట గడిచిని చంద్రశేఖర్ బయటకు రాకపోవడంతో జానకి అనుమానంతో గది తలుపులను తెరచి చూసింది. ఆ గదిలో చంద్రశేఖర్ కాళ్లు చేతులు తాళ్లతో బంధించి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందింది. దుండగులు ఆయనపై దాడి చేసి తీవ్రంగా గాయపరచి, వజ్రాన్ని దోచుకుని, గది వెనుకవైపు మార్గంలో పారిపోయారని తెలుసుకుంది. వెంటనే ఆమె వడపళని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసు అధికారులు కేసు నమోదు చేసుకుని దోపిడీ దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నగరం నలువైపులా పంపారు. ఆ హోటల్ పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీ ఆధారంగా దోపిడీ దొంగల వివరాలు, వారు ప్రయాణించిన కారు వివరాలు తెలుసుకోగలిగారు. వెంటనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీసులకు ఆ వివరాలు పంపారు.

కాగా దోపిడీ నేపథ్యంలో తూత్తుకుడి పుదూరుపాండియాపురం టోల్‌గేట్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వజ్రాన్ని దొంగిలించిన ముఠా ప్రయాణిస్తున్న కారు కనిపించింది. వెంటనే పోలీసులు ఆ కారును చుట్టుముట్టి పరమకుడికి చెందిన అరుణ్ పాండ్యరాజన్, అయప్పన్‌తాంగళ్‌కు చెందిన జాన్‌లయర్, వలసరవాక్కంకు చెందిన విజయ్, తిరువేర్కాడు చెందిన రతీష్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద దోపిడీకి గురైన వజ్రం కూడా పట్టుబడింది. వెంటనే దొంగలను అరెస్టు చేసినట్లు వడపళని పోలీసులకు వర్తమానం పంపారు. చెన్నై నుండి ప్రత్యేక దళం పోలీసులు విమానంలో తూత్తుకుడి చేరుకుని వజ్రాన్ని స్వాధీనం చేసుకుని నలుగురు దోపిడీ దొంగలను నిర్బంధించి చెన్నైకి తీసుకొచ్చి సెంట్రల్ జైలుకు పంపారు.

అధికారంలోకి వచ్చాక

వ్యాపారుల సమస్యలకు పరిష్కారం

● మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, మే 5 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యాపారుల సమస్యలకు పరిష్కారం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి, ఎడప్పాడి పళనిస్వామి వ్యాపారులకు హామీ ఇచ్చారు. చెంగల్పట్టు జిల్లా మరమలైనగర్‌లో సోమవారం తమిళనాడు వ్యాపారుల సంఘాల సమాఖ్య ఏర్పాటుచేసిన 42వ వ్యాపారుల దినోత్సవ మహానాడు సమాఖ్య అధ్యక్షుడు కొళత్తూరు టి.రవి సారథ్యంలో జరిగింది. రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆర్.రమేష్‌కుమార్, కె.కులదైవేల్ ఆహ్వానం పలికారు. ఈ మహానాడు వ్యాపారుల సంబంధించి పది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. ముఖ్యఅతిథిగా హాజరైన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి జ్యోతిప్రజ్వలన చేసి మహానాడును ప్రారంభించగా, ఆయనకు నిర్వాహకులు సెంగోల్ కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ.. చిన్న మధ్య తరహా వ్యాపారులకు నష్టం కలిగించేలా విదేశీ పెట్టుబడుల బిల్లుకు డీఎంకే మద్దతు తెలిపిందని వ్యాఖ్యానించారు. తాను ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో 24 గంటలు దుకాణాలు పనిచేసేందుకు అనుమతులిచ్చామన్నారు. గంజాయి, మద్యం మత్తులో కొంతమంది సంఘ విద్రోహులు దుకాణాల్లో చొరబడి వ్యాపారులపై దాడికి పాల్పడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నా.. డీఎంకే ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. చిన్న టీషాపులు, తాకట్టు దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, పండ్ల వ్యాపారులు, కిరాణా షాపులు నడుపుతున్న వ్యాపారులకు పోలీసు భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పి.బెంజిమెన్, మాఫోయి పాండ్యరాజన్, టీకేఎం చిన్నయ్యతో పాటు కోటీశ్వరన్, సిందా జయరామన్ తదిరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

సమాచార దర్పిణి

ఐఐటీఎం ఆధ్వర్యంలో ఉచిత 'ఏఐ' కోర్సులు

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్' (ఐఐటీఎం) ఆధ్వర్యంలో ఉచిత 'ఏఐ' కోర్సుల శిక్షణ జరుగనుంది. ఈ నెల 25వ నుంచి 45 గంటల కోర్సులు ఆన్‌లైన్ విధానంలో అందించబడతాయని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇవి విద్యార్థులు, బోధనా సిబ్బంది, ఉద్యోగాలు చేసే వారి కోసం ఉద్దేశించబడ్డాయి. ఔత్సాహికులు ఈ నెల 12వ తేదీ లోగా https://swayamplus.swayam2.ac.in/aiforallcourses అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌తో ఏర్పాటు చేయబడిన ఈ కోర్సులను రాబోయే విద్యా సంవత్సరం క్యాలెండర్ కోసం ఉన్నత విద్యా సంస్థలు క్రెడిట్ ప్రోగ్రాంగా చేపట్టవచ్చని, ఈ కోర్సులు అన్ని విభాగాల్లో ఏఐను అందుబాటులో వుంచే లక్ష్యంతో తయారు చేయబడ్డాయని ఐఐటీఎం డీన్ (ప్లానింగ్) ప్రొఫెసర్ ఆర్.సారథి పేర్కొన్నారు. ఈ కోర్సులు కేవలం ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం మాత్రమే కాకుండా ఆర్ట్స్, సైన్స్, కామర్స్ ఇతర రంగాల వారి కోసం కూడా ఉద్దేశించబడ్డాయని ఆయన వివరించారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

● తెలుగు విద్యార్థులకు ప్రాధాన్యం

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు 'కొల్లిపార మాజేటి జయశ్రీ చారిటబుల్ ట్రస్టు' స్కాలర్‌షిప్‌లు ఇవ్వనుంది. ఇందులో తెలుగు మాధ్యమం చదివే విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎంఎస్ చంద్రగుప్త, ట్రస్టీ ఎం.తనూజ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఔత్సాహికులు జూన్ 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99625 28207, 98845 88713 మొబైల్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

మెరీనా తీరంలో రూ.10 లక్షలతో క్రీడా మైదానం

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌లో రూ.10 లక్షలతో క్రీడా మైదానం ఏర్పాటుకానుంది. ప్రపంచ ప్రసిద్ధిచెందిన మెరీనా బీచ్‌కు ప్రతిరోజు ప్రజలు పెద్దసంఖ్యలో వస్తుంటారు. కానీ, పిల్లలు ఆడుకొనేలా సరైన సదుపాయం లేదు.. ఈ నేపథ్యంలో, మెరీనా స్విమ్మింగ్ పూల్ సమీపంలో రూ.10 లక్షలతో క్రీడా మైదానం ఏర్పాటుచేయాలని చెన్నై కార్పొరేషన్ నిర్ణయించింది. క్రీడా మైదానం పనులు ప్రారంభం కాగా పిల్లలు ఆడుకునే క్రీడా ఉపకరణాలు ఏర్పాటవుతున్నాయి. పనులు పూర్తిచేసి మరో వారం రోజుల్లో ఈ మైదానం అందుబాటులోకి రానుందని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

నేడు ఎండీఎంకే 32వ వార్షికోత్సవం

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎండీఎంకే 32వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. ఈ విషయమై ఆ పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... పార్టీ 32వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటలకు ఎగ్మూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో, ప్రిన్సిపల్ కార్యదర్శి దురై వైగో ప్రసంగించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, శాఖల నిర్వాహకులు పాల్గొనాలని పార్టీ విజ్ఞప్తి చేసింది.

'ఏపీసీ సీజన్-2' క్రికెట్ పోటీలకు ఆహ్వానం

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆవడి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 'ఏపీసీ సీజన్-2' క్రికెట్ పోటీలు ఈ నెల 10 నుంచి 18వ తేది వరకు జరుగనున్నాయి. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే ఇబ్బందులు, అనారోగ్య సమస్యలపై యువకులకు అవగాహన కల్పించడం కోసం ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో యువకులు, ప్రజలు విభాగంలో 64 జట్లు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగుల విభాగంలో 16 జట్లు పాల్గొననున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆసక్తి కలిగిన జట్లు 9894040459 అనే నెంబరు సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలని ఆవడి పోలీస్ కమిషనర్ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

'టాటూ' వృత్తి చేపట్టేందుకు అనుమతించండి

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో 'టాటూ' దుకాణాల కార్మికులు 'టాటూ' వృత్తి చేసేందుకు అనుమతించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కన్నియాకుమారి పట్టణ పంచాయతి, దేవస్థానం ప్రాంతాల్లో ఏడేళ్లుగా 30కి పైగా టాటూ దుకాణాలు నడుస్తున్నాయి. అలాగే, మరికొందరు ఆన్‌లైన్ ద్వారా టాటా శిక్షణ తీసుకుని సర్టిఫికెట్లు పొందారు. ఈ నేపథ్యంలో, టాటూ దుకాణాలను ఈ నెల 1 నుంచి మూసివేయాలని జిల్లా అధికారుల మౌఖిక ఉత్తర్వులతో దుకాణాలు మూతపడ్డాయి. ఈ క్రమంలో, తమ జీవనోపాధి పరిగణలోకి తీసుకొని టాటూ దుకాణాలు నడుపుకునేందుకు అనుమతించాలని కోరుతూ టాటూ దుకాణాల యజమానులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

ఎంపీ రాజాకు తప్పిన ముప్పు

● పోడియంపై కూలిన స్తంభం



పోడియం వద్ద రాజా ప్రసంగిస్తుండగా వాలుతున్న ఇనుప స్తంభం. రాజా పక్కకు తప్పుకోవటంతో స్తంభం కూలి ముక్కలవుతున్న పోడియం - పోడియంపై పడిన ఇనుప స్తంభాన్ని గమనిస్తున్న రాజా, పార్టీ ప్రముఖులు

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురైలో జరిగిన పార్టీ బహిరంగసభలో డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ లోక్‌సభ్యుడు ఎ.రాజా ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. రాజా ప్రసంగిస్తున్న పోడియంపై విద్యుత్ లైట్లు బిగించిన స్తంభం పెనుగాలుల కారణంగా కూలిపడింది. రాజా ప్రసంగిస్తూనే ఆ స్తంభం వేగంగా పోడియం వైపు వాలుతుండటాన్ని గమనించి పక్కకు తప్పుకున్నారు. వెంటనే పోడియంపై ఆ ఇనుప స్తంభం కూలిపడటంతో స్తంభంలోని లైట్లు, పోడియం ధ్వంసమయ్యాయి. రాజా తన ప్రసంగంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ప్రవేశపెట్టిన పథకాల గురించి మాట్లాడుతూ తమిళభాషకు ప్రాచీన హోదా రావటానికి ఆయనే కారణమని చెబుతున్నప్పుడు ఆ ఇనుప స్తంభం పెనుగాలులకు పోడియంపై కూలిపడింది. ఈ సంఘటన కారణంగా పార్టీ సభను అర్థాంతరంగా రద్దు చేశారు. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో అటు న్యూస్ ఛానెళ్లలో, ఇటు యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్‌మీడియాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది.

జాతరలో విద్యార్థి హత్య

ప్యారీస్, మే 5 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లా కులిత్తలై మారియమ్మన్ ఆలయ జాతరలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ విద్యార్థి హత్యకు దారితీసింది. పోలీసుల కథనం మేరకు మారియమ్మన్ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో గ్రామప్రజలు పాల్గొన్నారు. ఊరేగింపు సోమవారం తెల్లవారుజామున 2గంటలకు పేలయమ్మ ఆలయవీధికి చేరుకున్న సమయంలో కొంతమంది యువకులు ఊరేగింపులో నృత్యం చేశారు. ఆ సమయంలో శ్యామ్‌సుందర్ (17)అనే విద్యార్థికి, మరో వర్గానికి చెందిన యువకుల మధ్య నృత్యం చేయడంలో ఏర్పడిన వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. ఇందులో కులిత్తలైకు చెందిన నాగేంద్రన్ కత్తితో దాడిచేయంతో తీవ్రగాయాలైన శ్యామ్‌సుందర్‌ను గ్రామస్తులు కులిత్తలై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక శ్యామ్‌సుందర్ సోమవారం ఉదయం మరణించినట్లు పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నాగేంద్రన్ కోసం గాలిస్తున్నారు. కాగా, ప్లస్‌టూ పరీక్షలు రాసి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్న శ్యామ్ సుందర్‌ను దారుణంగా హతమార్చిన సంఘటన కులిత్తలై ప్రాంతవాసులను కలవరపరిచింది.

గుంతలో పడి దంపతుల మృతి కేసులో నలుగురిపై కేసు నమోదు

ప్యారీస్, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా దారాపురంలో రోడ్డువిస్తరణ పనులకు తవ్విన గుంతలో పడి దంపతులు బలైన వ్యవహారంలో పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. జిల్లాలోని గుండం ప్రాంతానికి చెందిన నాగరాజ్ (44), ఆనంది (38)అనే దంపతులు తమ కుమార్తె దీక్షత (14)తో కలిసి కారైక్కాల్‌లోని శనేశ్వరాలయానికి వెళ్ళి ఆదివారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంలో వస్తుండగా, దారాపురం ప్రాంతంలో రోడ్డు విస్తరణ కోసం తవ్విన 12 అడుగుల గుంతలో వెలుతురు తక్కువగా ఉండటంతో ద్విచక్ర వాహనంతో సహా పడి దంపతులు మృతిచెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టంకు పంపించి, కేసు నమోదు చేసి, విచారణ జరిపి రోడ్డు విస్తరణ కోసం తవ్విన గుంతవల్లే ఈ ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. దీనికి సంబంధించి కాంట్రాక్టర్ శివకుమార్, ఇంజనీర్ గుణశేఖర్ సహా నలుగురిపై కేసు నమోదు చేశారు.

సబర్బన్ రైలు ఢీకొని యువతి మృతి

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాంబళం సమీపంలో సబర్బన్ రైలు ఢీకొని యువతి మృతిచెందింది. విల్లుపురం జిల్లా సాత్తంబాడి గ్రామానికి చెందిన మురుగన్ కుమార్తె జానకి (18) నగరంలో ఉంటూ టి.నగర్‌లోని ఓ దుకాణంలో పనిచేస్తోంది. ఆమె ఆదివారం దుకాణానికి వెళ్లేందుకు టి.నగర్-కోడంబాక్కం మధ్య రైలు పట్టాలు దాటుతున్న సమయంలో తాంబరం నుంచి చెన్నై బీచ్ వైపు వెళ్తున్న సబర్బన్ రైలు ఢీకొంది. ఈ ఘటనలో జానకి ఘటనా స్థలంలోనే మృతిచెందింది. మాంగళం రైల్వే పోలీసులు ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

స్పా సెంటర్‌లో వ్యభిచారం ?

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రీమ్స్ రోడ్డులోని స్పా సెంటర్‌లో తనిఖీలు చేపట్టిన పోలీసులు ఏడుగురు మహిళలను రక్షించారు. థౌజండ్ లైట్స్ పోలీసులకు అందిన సమాచారంతో గ్రీమ్స్ రోడ్డులోని ఓ భవనంలో పనిచేస్తున్న స్పా సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అక్కడ మహిళలతో వ్యభిచారం చేయిస్తున్నట్లు గురించి, ఏడుగురు మహిళలను ప్రభుత్వ హోంకు తరలించారు. అలాగే, స్పా సెంటర్‌లో రూ.29,170 నగదు, ఒక సెల్‌ఫోన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... స్పా సెంటర్ యజమాని, మహిళా మేనేజర్ సహా ఐదుగురు మహిళలతో వ్యభిచారం సాగిస్తున్నట్లు తెలియడంతో, పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

పిడుగుపాటుకు విద్యార్థి మృతి

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు విద్యార్థి మృతిచెందిన ఘటన శివగంగ జిల్లాలో చోటుచేసుకుంది. మేలరాంగియం గ్రామానికి చెందిన చిన్నవీర కుమారుడు వినోద్‌కుమార్ మదురైలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో స్వగ్రామానికి వచ్చిన వినోద్‌కుమార్, ఆదివారం సాయంత్రం తాము పెంచుతున్న ఆవులు, గేదెలను తోలుకొని పొలానికి వెళ్లాడు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వినోద్ కుమార్ సమీపంలో పిడుగు పడి షాక్‌కు గురై మృతిచెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్లు...

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల కుమార్తె, తండ్రి మృతిచెందగా, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. పూవంది గ్రామానికి చెందిన పొన్‌రాజ్ పొరుగు దేశంలో ఉద్యోగం చేస్తూ కొద్దిరోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అతను భార్య ప్రదీప, కుమార్తె అనూసియా (3)లతో కలసి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. నాడార్‌మంగళం సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన కారును వీరి బైక్ ఢీకొంది. ఈ ఘటనలో అనూసియా, పొన్‌రాజ్ తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందారు. గాయపడిన ప్రదీపను చుట్టుపక్కల వారు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నీటమునిగి ఇద్దరు యువకులు...

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): హొగెనేకల్‌లో నీటమునిగి ఇద్దరు యువకులు మృతిచెందారు. వేసవి ఎండల నుంచి ఉపశమనం కోసం ప్రజలు ఊటీ, కొడైకెనాల్, ఏర్కాడు తదితర చల్లటి ప్రదేశాలకు వెళ్తున్నారు. కడలూరు జిల్లా బన్రూట్టికి చెందిన 20 మంది యువకులు విహార యాత్రకు వ్యాన్‌లో హొగెనేకల్ వెళ్లారు. ఆదివారం ఉదయం ఆ ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలకు వెళ్లి సరదాగా గడిపిన యువకులు, అ ప్రాంతంలోని నదిలో స్నానాలకు దిగారు. వారు స్నానం చేస్తున్న సమయంలో ధనశేఖరన్, రవి ఊహించని విధంగా లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగారు. సమాచారం అందుకున్న హొగెనేకల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకుని నదిలో గాలించి ఇద్దరి మృతదేహాలు వెలికితీసి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒకేరోజు పోలీసులను ఆశ్రయించిన మూడు ప్రేమ జంటలు



పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంటలు

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఒకేరోజు మూడు ప్రేమ జంటలు సేలం ఓమలూరు మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాయి. రాష్ట్రంలో ఆదివారం నుంచి శుభ ముహూర్తాలు ప్రారంభం అయ్యాయి.. ఈ నేపథ్యంలో, మేట్టూరుకు చెందిన విఘ్నేష్-ఊత్తంగరై సీత కృష్ణగిరిలో ఉద్యోగం చేస్తూ ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నారు. అలాగే, పెన్నాగరం సంజయ్-మేట్టూరు కలైవాని తదితరులు కూడా తల్లిదండ్రులు ఎదురుచెప్పిన నేపథ్యంలో, ప్రేమ వివాహం చేసుకున్నారు. అదేవిధంగా తిరునల్వేలి జిల్లా అంబాసముద్రంకు చెందిన విఘ్నేష్-శ్వేత చెన్నైలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ మూడు జంటలు తమ తల్లిదండ్రులు, బంధువుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. వారి తల్లిదండ్రులను పిలిపించిన పోలీసులు, వారితో మాట్లాడి నూతన వధూవరులను పంపించారు.

పొల్లాచ్చిలో ట్రెక్కింగ్‌కు వెళ్లిన వైద్యుడి మృతి



అజ్జల్ సెయిన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పొల్లాచ్చి సమీపంలో ట్రెక్కింగ్ వెళ్లిన కేరళ వైద్యుడు మృతిచెందగా, అతని స్నేహితుడు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. కేరళ రాష్ట్రం తిరువనంతపురానికి చెందిన అజ్జల్ సెయిన్ (26) వైద్య కోర్సు పూర్తిచేశాడు. అతని స్నేహితుడు భాగల్‌తో కలసి ట్రెక్కింగ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తమిళనాడు పర్యావరణ ప్రాజెక్ట్‌లో పొల్లాచ్చి టాప్ స్లిప్ ప్రాంతంలోని కొండ ఎక్కేందుకు పేర్లు నమోదుచేసుకున్నారు. ఆదివారం ఉదయం శిక్షణ పొందిన గైడ్లు సంతాన ప్రకాష్, అజిత్‌కుమార్, అటవీశాఖ అధికారులతో కలసి అజ్జల్ సెయిన్, భాగల్ కలిసి సోలా నుంచి బండారా రాక్ వరకు నడిచారు. 8 కి.మీ నడిచిన ఈ బృందం బండారా రాక్ నుంచి టాప్‌స్లిప్‌కు పయనమయ్యారు. ఆ సమయంలో ఊహించని విధంగా అజ్జల్ సెయిన్, భాగల్ శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడ్డారు. అటవీశాఖ అధికారులు వారిని అంబులెన్స్‌లో వేట్టైకారన్‌పుదూర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అజ్జల్ సెయిన్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. అపస్మారక స్థితిలో ఉన్న భాగల్‌ను మెరుగైన చికిత్స కోసం పొల్లాచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కండలేరు నుంచి రాష్ట్రానికి నీటి విడుదల

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి రాష్ట్రానికి సెకనుకు 500 ఘనపుటడుగుల చొప్పున నీటి విడుదల చేస్తున్నారు. రాజధాని నగరం చెన్నై వాసులు దాహార్తి తీర్చే పూండి జలాశయంలో వర్షపు నీరు, ఆంధ్ర రాష్ట్రం నెల్లూరు సమీపంలోని కండలేరు జలాశయం నుంచి విడుదల చేసే కృష్ణా జలాలను నిల్వ చేస్తుంటారు. తాగునీటి అవసరాల నిమిత్తం పూండి నుండి పుళల్, చెంబరంబాక్కం జలాశయాలకు నీరు విడుదల చేస్తుంటారు. కృష్ణా జలాల ఒప్పందం ప్రకారం ఆంధ్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రాష్ట్రానికి 12 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం కండలేరు నుంచి రాష్ట్రానికి 500 ఘనపుటడుగుల చొప్పున నీటిని విడుదల చేశారు. ఈ జలాలు మూడు రోజుల అనంతరం రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఊత్తుకోట జీరో పాయింట్, అక్కడి నుంచి పూండి జలాశయానికి చేరుకుంటాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నూతన వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింల నిరసన



వేలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వ్యతిరేకిస్తూ వేలూరు గుడియాత్తం కొత్త బస్టాండు సమీపంలో ముస్లిం కమిటీ సభ్యులు సోమవారం దర్నా చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తుందని, ఈ నూతన చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని తెలిపారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

వేలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేలూరు జిల్లా పేర్నాంబట్టు పంచాయతీ శివారు గ్రామాల్లో గ్రామస్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథులుగా పేర్నాంబట్టు వ్యవసాయ మండలి అధ్యక్షుడు జనార్థన్, వినోద్‌కుమార్ పాల్గొని గ్రామస్థుల పిల్లలకు బాల్య వివాహాలు చేయకూడని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పోలీసు అధికారులు, పలు వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ నికర లాభం రూ.10,918 కోట్లు

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్యాంక్ నికర లాభం రూ.10,918 కోట్లకు పెరిగిందని, ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే 35 శాతం అధికమని ఆ బ్యాంక్ ఉన్నతాధికారులు ప్రకటించారు. గత మార్చి నెలతో ముగిసిన నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను పరిశీలించగా బ్యాంక్ అన్ని అంశాల్లోనూ అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్లు స్పష్టమవుతోందని ఆ బ్యాంక్ ఉన్నతాధికారులు ప్రకటించారు. బ్యాంక్ నిర్వహణా లాభాలు 13 శాతం పెరిగి రూ.16,840 కోట్ల నుండి రూ.18,998 కోట్లకు చేరిందని, నికర వడ్డీ ఆదాయం కూడా 8 శాతం పెరిగి రూ.25,176 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. రూ.13.25లక్షల కోట్ల మేర తమ బ్యాంక్ విదేశీ వాణిజ్యం నిర్వహిస్తోందని తెలిపారు. ఇక 5901 శాఖలు కలిగిన తమ బ్యాంక్‌కు మూడు ఓవర్సీస్ బ్యాంకులు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. మొబైల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుంటున్న ఖాతాదారుల సంఖ్య 16 శాతం పెరిగిందని, ఆ మేరకు 1.94 కోట్ల మంది ఈ సేవల ద్వారా లబ్ధిపొందుతున్నారని బ్యాంక్ ఉన్నతాధికారులు తెలిపారు.

సీబీఎస్‌ఈ రీ వాల్యుయేషన్‌లో కొత్త విధానం

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల ఫలితాలు త్వరలో విడుదల చేయనున్న నేపథ్యంలో, రీ వాల్యుయేషన్‌లో కొత్త విధానం అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు విద్యార్థులు మొదట మార్కులు చూసిన తర్వాత జవాబు పత్రాల నకలు పొంది రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకుంటారు. కొత్త విధానం ప్రకారం, విద్యార్థులు తొలుత మూల్యాంకనం చేసిన సమాధాన పత్రాల కాపీలు పొందాలి. ఆ తర్వాత, మార్కులు సరిచూసుకోవడం, రీ వాల్యుయేషన్, అలాగే, రెండింటినీ ఒకే సమయంలో చేసుకొనే అవకాశం కల్పించారు. ఈ విధానం 2024-25 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లు సీబీఎస్‌ఈ ఒక ప్రకటనలో తెలిపింది.

తొమ్మిది నెలల్లో మహిళా బృందాలకు గుర్తింపు కార్డులు

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు 60 లక్షల మందికి గుర్తింపు కార్డులు అందించే ప్రక్రియ 9 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రభుత్వం ప్రారంభించిన స్వయం సహాయక బృందాల మహిళలకు మొదటి విడతలో, స్వచ్ఛంద సంస్థలు ప్రారంభించిన బృందాల సభ్యులకు రెండో విడతగా గుర్తింపు కార్డులు అందజేయనున్నారు. ఈ కార్డులు కలిగిన సభ్యులు, ఏసీ మినహా అన్నిరకాల ప్రభుత్వ బస్సుల్లో 25 కిలోల వరకు తమ బృందాలు తయారుచేసే ఉత్పత్తులు ఉచితంగా తీసుకెళ్లవచ్చు. కో-ఆప్‌టెక్స్‌లో దుస్తుల కొనుగోలులో 5 శాతం రాయితీ పొందవచ్చు. సహకార, ఆహార, వినియోగదారుల భద్రతా శాఖలు అందజేసే రుణాల పథకంలో వీరు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆవిన్ వస్తువులు కూడా రాయితీ ధరలో పొందవచ్చు. మీ-సేవా కేంద్రాల ద్వారా అందించే సేవల్లో కూడా 10 శాతం వరకు రాయితీ పొందవచ్చని అధికారులు తెలిపారు.

గూడలూరులో ఏనుగు స్వైర విహారం

● ఇంటి గోడలు, వాహనాల ధ్వంసం



ఓ ఇంటిలో చొరబడిన అడవి ఏనుగు

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా గూడలూరు సమీపంలోని జనావాస ప్రాంతాల్లోకి వచ్చిన ఓ అడవి ఏనుగు ఇళ్లలో దూరి విధ్వంసానికి పాల్పడింది. ఇళ్లలోని పక్కవాటు గోడలను తొండంతో కూల్చిపడేసింది. రహదారులలో, ఇళ్ల ముందు ఉన్న ద్విచక్రవాహనాలను ధ్వంసం చేసింది. గూడలూరు సమీపం నెలాకోట్టై గ్రామంలో సోమవారం వేకువజాము ఓ అడవి ఏనుగు చొరబడి రోడ్డు పక్కగా ఉన్న వాహనాలను ధ్వంసం చేసింది. ఆ ప్రాంతంలోని ఇళ్లల్లో చొరబడి పైకప్పు రేకులను, పక్కవాటు గోడలను తొండంతో కూల్చిపడేసింది. ఆ ఏనుగు చేస్తున్న విధ్వంసాన్ని చూసి ఊరిలోని కుక్కలన్నీ మొరగటంతో గ్రామస్థులు ఉలిక్కిపడి లేచి చూడగా అడవి ఏనుగు కనిపించింది. వెంటనే అటవీ శాఖ అధికారులకు ఫోన్ చేశారు. అటవీ శాఖ అధికారులు సకాలంలో అక్కడికి చేరలేకపోవటంతో గ్రామస్తులంతా కలిసి టపాసులు పేల్చి, ఇనుపరేకులతో చప్పుడు చేస్తూ ఆ ఏనుగును అడవిలోకి తరిమికొట్టారు. ఆ తర్వాత అంతా కలిసి రాస్తారోకో జరిపారు. అడవి ఏనుగుల బెడద నుండి కాపాడేందుకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

నిషేధిత వాహనాలకు రిజిస్ట్రేషన్... అధికారులపై కేసు నమోదు

● మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మోటారు వాహన చట్టప్రకారం నిషేధించిన వాహనాలకు రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై కేసు నమోదు చేయాల్సిందిగా చెన్నై పోలీస్ కమిషనర్‌కు మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. 2017వ సంవత్సరం పరిచయం చేసిన బీఎస్-4 కేటగిరి వాహనాలకు రాష్ట్రప్రభుత్వం 2020 ఏప్రిల్‌లో స్టే విధించింది. అయినప్పటికీ 2020 తర్వాత కూడా 315 వాహనాలకు నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ మోసంపై విచారణ జరపాలని కోరుతూ నగరానికి చెందిన దేవదాస్ గాంధీ విల్సన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అందులో నిషేధిత వాహనాలకు రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో ఆర్టీవో అధికారులకు సంబంధాలున్నాయని తెలిపారు. అందువల్ల ఈ అవినీతిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, అవినీతి నిరోధక శాఖ అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు కమిటీని నియమించి విచారణకు ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. సోమవారం ఈ పిటిషన్ హైకోర్టు న్యాయమూర్తి జీకే ఇళంద్రిన్ ముందు విచారణకు వచ్చింది. ప్రభుత్వం, పిటిషనర్ తరుపు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన నివేదిక దాఖలు చేయాల్సిందిగా చెన్నై పోలీస్ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీచేశారు. కేసు తదుపరి విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేశారు.

ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

● కలెక్టర్ సుబ్బులక్ష్మి



ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఓటు నమోదు చేసుకున్న వారి కొత్త ఓటర్ జాబితాను కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆవిష్కరించారు. వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కార్పొరేషన్ ఎన్నికల నిర్వాహణ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పలు రాజకీయ పార్టీలు పంచాయతీ ఎన్నికల్లో ఈవీఎం మిషన్లను వినియోగించాలనే అభ్యర్థనను స్వాగతిస్తున్నామని, కాకపోతే దానిని నెరవేర్చే హక్కు కేంద్ర ఎన్నికల సంఘానిదని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ సెందిల్‌కుమార్, పోలింగ్ బూత్ కమిటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సన్మానం

వేలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కోడైరౌండ్ రోడ్డులో ఉన్న పోలీసు సంక్షేమ కార్యాలయంలో మాజీ సైనికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా మేజర్ జనరల్ అహ్మద్ పాల్గొని దేశం కోసం ప్రాణత్యాగానికి కూడా వెనకాడకుండా సరిహద్దులో కాపలాకాసి, రిటైర్డ్ అయిన సైనికులను మనవంతుగా సన్మానం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ దయాలన్, సుబేదార్, రాజేష్ తదితరులు పాల్గొని మాజీ సైనికులకు శాలువాలతో సన్మానం చేసి జ్ఞాపికలు ప్రదానం చేశారు.

7 నుంచి ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్యారీస్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-2026వ విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు బుధవారం నుంచి దరఖాస్తు నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారులు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల ఫలితాలు ఈ నెల 9న విడుదల కానున్న నేపథ్యంలో ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియను ఉన్నత విద్యా శాఖ మంత్రి కేవీ చెళియన్ బుధవారం ఉదయం ప్రారంభించనున్నారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే విద్యార్థులు దరఖాస్తుల నమోదు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

శివపురాణం పుస్తకాల పంపిణీ



వేలూరు, మే 5 (ఆంధ్ర జ్యోతి): వేలూరు ఉపాధ్యాయుల సంఘ నిర్వాహకులకు సోమవారం ఉదయం జ్ఞానశక్తి వేలన్ రాసిన శివపురాణం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రచయితలు లక్ష్మీపతి, రాజాబాబు, పాఠశాల ఉపాధ్యాయులు జోసెఫ్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తా పౌర్ణమి గిరిప్రదక్షిణకు భారీ ఏర్పాట్లు

● జిల్లా కలెక్టర్ ధర్భగరాజ్



వేలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో చిత్తా పౌర్ణమి గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కలెక్టర్ ధర్భగరాజ్ తెలిపారు. ఈ నేపథ్యంలో, ఆయన సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణాలను ఆయన పరిశీలించారు. గిరిప్రదక్షిణలో ఎలాంటి ఇబ్బంది జరగకుండా భారీ పోలీసు భద్రతను ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

● బీజేపీ నేతల ర్యాలీ



వేలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తూ వేలూరు జిల్లా బీజేపీ నేతల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు దశరథన్, బీజేపీ వ్యాపారుల విభాగం కార్యదర్శి ఇళంగో, ప్రాంతీయ నేతలు జగన్, సురేష్, యువరాజ్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్, అంబత్తూర్, తండయార్‌పేట, కేకే నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. మైలాపూర్ పరిధిలో కోడంబాక్కం హైరోడ్డు సమీపంలోని ఎస్‌ఈ కార్యాలయం, అంబత్తూర్ పరిధిలో అంబత్తూర్ ఎస్టేట్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, తండయార్‌పేట పరిధిలో తండయార్‌పేట టవర్ క్లాక్ ఎదురుగా ఉన్న ఎస్‌ఈ కార్యాలయం, కేకే నగర్‌లోని సబ్ స్టేషన్ ప్రాంగణంలోని ఎస్‌ఈ కార్యాలయంలో జరుగనున్న గ్రీవెన్స్‌లో, ఆయా ప్రాంతాల ప్రజలు పాల్గొని విద్యుత్ సంబంధిత సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

వాస్తవిక కథాంశంతో 'ఆండవన్'

వాస్తవిక కథాంశంతో రూపొందిన 'ఆండవన్' చిత్రం ఆడియో, ట్రైలర్ తాజాగా రిలీజ్ చేశారు. ప్రముఖ దర్శక నటుడు కె.భాగ్యరాజ్, ప్రముఖ స్టంట్ మాస్టర్ జాగ్వార్ తంగం, కేంద్రన్ మునియ స్వామి, గంజా కరుప్పు, ముత్తుకాళై, మాస్టర్ మహేంద్రన్ తదితర ప్రముఖుల సమక్షంలో విడుదల చేశారు. మహేష్, వైష్ణవి జంటగా నటించిన ఈ చిత్రానికి విల్లితిరుకణ్ణన్ దర్శకత్వం వహించారు. ఈ ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ, 'దేశంలో మనుషులు లేని గ్రామాల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నాయి. అలాంటి గ్రామాలను రక్షించాలి. ఇలాంటి వాస్తవిక కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఇందులో కలెక్టర్ పాత్రను కె.భాగ్యరాజ్ పోషించారు. యూ ట్యూబర్ మహేష్ ప్రధాన పాత్రలో నటించగా, ఆయన సరసన వైష్ణవి కథనాయికగా నటించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 16వ తేదీ థియేటర్లలో విడుదల చేస్తున్నాం' అని వివరించారు.


'ఆండవన్' ఆడియో రిలీజ్ దృశ్యం

హాస్య నటుడు గౌండమణికి భార్యా వియోగం

ప్రముఖ హాస్య నటుడు గౌండమణి ఇంట విషాదం నెలకొంది. ఆయన సతీమణి శాంతి (67) కన్నుమూసారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. తేనాంపేటలోని గౌండమణి నివాసంలో ఆమె భౌతికకాయాన్ని సినీ ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. ఈ దంపతులకు సెల్వి, సుమిత్ర అనే ఇద్దరు కుమార్తెలున్నారు. అంత్యక్రియలు మంగళవారం ఉదయం 11.30 గంటలకు బీసెంట్ నగర్‌లోని విద్యుత్ దహన శ్మశానవాటికలో నిర్వహించన్నట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. జీవిత భాగస్వామిని కోల్పోయి దుఃఖసాగరంలో మునిగిపోయిన గౌండమణిని టీవీకే నేత, సినీ నటుడు విజయ్ సహా పలువురు సినీ ప్రముఖులు పరామర్శించి, తమ ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.


శాంతి (ఫైల్‌ఫొటో)


గౌండమణిని ఓదారుస్తున్న విజయ్

పాన్ ఇండియా స్టార్‌గా సంపత్ రామ్


గత పాతికేళ్ళుగా చిత్రపరిశ్రమలో రాణిస్తూ వివిధ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న సంపత్ రామ్ ఇపుడు పాన్ ఇండియా నటుడుగా ఎదిగారు. ఆయనకు మాలీవుడ్ నుంచి మలయాళ పురస్కార్ సమితి 'మలయాళం పురస్కారం 1200' పేరుతో సన్మానించింది. గత 25 యేళ్ళుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతూ, తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ చిత్రాలతో పాటు ఇతర భాషా చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు, ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. అగ్ర నటుడు మోహన్‌లాల్, సురేష్ గోపి కలిసి నటించిన 'జనకన్' మూవీ ద్వారా ప్రధాన విలన్‌గా అరంగేట్రం చేసిన సంపత్ రామ్.. 'మాళిగైపురం' చిత్రంతో ఒక్కసారిగా అందరిదృష్టిని ఆకర్షించారు. అనేక చిత్రాల్లో విలన్‌గా భయపెట్టిన ఆయన... తొలసారి ఒక ఆకర్షణీయమైన పాత్రలో కనిపించను న్నారు. ఇస్లామిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిలా ఎమోషనల్ టచ్‌తో నటించారు. ఈ పాత్ర ప్రేక్షకుల మనసుల్లో మంచి ప్రభావం చూపుతుందని, ప్రతినాయకుడు అనే భావనకు మించి మంచి క్యారెక్టర్ నటుడు అనే గుర్తింపు కూడా వస్తుందని భావిస్తున్నారు. ఇదే విషయంపై సంపత్ రామ్ మాట్లాడుతూ, 'నేను ఇండస్ట్రీలో 25 యేళ్ళుగా కొనసాగుతున్నాను. ఇప్పటివరకు చిన్న చిన్న పాత్రల్లోనే నటించారు. పెద్ద పెద్ద హీరోల్లో విలన్ పాత్రలను పోషించాలన్నదే నా ప్రధాన కోరిక. అందుకోసం నిరంతరం శ్రమిస్తున్నాను. తమిళంలో అలాంటి అవకాశం రాలేదు. వస్తే మాత్రం తప్పకుండా నిరూపించుకుంటాను. తెలుగులో మోహన్‌బాబు - విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' పాత్రలో నటించాను' అని వివరించారు.


అవార్డు అందుకుంటున్న సంపత్ రామ్

చిత్రజ్యోతి

పురాణ నేపథ్యంలో 'యమన్'

ఈ మధ్యకాలంలో పురాణ ఇతిహాసాల నేపథ్యంలో తెరకెక్కుతున్న అనేక చిత్రాలు ఘన విజయాలను సొంతం చేసుకుంటున్నాయి. దీంతో పురాణ నేపథ్యంలో 'యమన్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. నటుడు జగదీష్ ప్రధాన పాత్ర పోషించే ఈ చిత్రంలో హీరోయిన్‌గా శ్రావణి శెట్టి నటిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన మేకర్స్ కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టరుతో పాటు దీపావళి పండుగను పురస్కరించుకుని రిలీజ్ చేసిన ప్రత్యేక లుక్‌లకు విశేష స్పందన వచ్చిన విషయం తెల్సిందే. ఇపుడు రిలీజ్ చేసిన న్యూ లుక్‌లో జగదీష్ యమధర్మరాజుగా భయంకరమైన లుక్‌లో కనిపిస్తున్నారు. ఓ యువతి యముడి చేతుల్లో చిక్కుకునివున్నట్టుగా డిజైన్ చేశారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది. త్వరలోనే ఆడియో, ట్రైలర్, మూవీ విడుదల తేదీలను వెల్లడించనున్నట్టు మేకర్స్ వెల్లడించారు.


'యమన్'లో ఓ దృశ్యం

అలరించిన నాట్యాచార్య 'అర్చన' నృత్యప్రదర్శన

ప్యారీస్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లో వున్న శ్రీవారి ఆలయం వేదికగా నాట్యాచార్య అర్చన నృత్యప్రదర్శన అద్యంతం అలరించింది. శ్రీమాత ట్రస్ట్ - కోయంబత్తూరు నాట్యాచార్య అర్చన టీటీడీ దేవస్థానం శ్రవణం హాలులో నాట్య సేవ పేరిట నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాట్యాచార్య అర్చన కృష్ణాష్టకం, కృష్ణ అష్టోత్తరాలను నృత్య రూపంలో ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అలాగే అన్నమాచార్య, త్యాగరాజ, తులసీదాస్, వల్లభాచార్య, నామ్‌దేవ్, భక్త మీరాభాయి తదితరుల కీర్తనలకు నృత్యం జతచేర్చి అందులోని భక్తిభావాన్ని వీక్షకులకు అందించారు. నాట్యాచార్య అర్చనతో పాటు ఆమె శిష్యురాలు దీప్తి కూడా కలిసి తన నాట్యప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం నాట్యాచార్య అర్చన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం చెన్నై టీటీడీ ఆలయంతో పాటు తిరుమల, గురువాయూర్, ఉడుపి, మూగాంబిక, కుంభమేళ, హరిద్వార్, చిదంబరం, తంజావూరు తదితర ప్రాంతాల్లో తన బృందం నృత్యప్రదర్శనలిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చెన్నై టీటీడీ ఆలయంలో ప్రదర్శనకు అవకాశం కల్పించిన టీటీడీ-చెన్నై ఏఈవో పార్థసారథి, దర్మ ప్రచార పరిషత్ నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.


నృత్యప్రదర్శన చేస్తున్న అర్చన

కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలకు స్వామిమలై విగ్రహాలు

పెరంబూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): హిందువులకు అత్యంత పవిత్రమైన ప్రదేశాల్లో ఒకటైన ఉత్తరాఖండ్ రాష్ట్రం కిష్కింధ సంస్థానం, స్వర్ణ హంపిలోని హనుమాన్ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో 2021లో 12 అడుగుల ఎత్తున ప్రతిష్టించిన ఆది శంకాచార్యుల రాతి విగ్రహాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. అక్కడ నిత్యపూజలు నిర్వహించేలా ఆదిశంకరుల ఎంచలోహ విగ్రహం తయారుచేయాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. అందుకోసం విగ్రహ తయారీ పనులు తంజావూరు జిల్లా స్వామిమలై సమీపం తిమ్మకుడిలోని 'కాస్ట్ ఇన్ ఫ్రాన్స్ క్రియేటివ్' అనే శిల్ప కళాక్షేత్రానికి అప్పగించారు. స్థపతి వరదరాజ్ నేతృత్వంలో 15 మంది కళాకారులు 40 రోజులు శ్రమించి, పంచలోహాలతో, ఒకటిన్నర అడుగు ఎత్తున నాలుగు ఆదిశంకర విగ్రహాలు రూపొందించారు. ఒక్కొక్కటి 37 కిలోల బరువున్న ఈ విగ్రహాలను మూడు రోజుల క్రితం విమానంలో తరలించారు.


పంచలోహ ఆదిశంకర విగ్రహాలు

మీడియాతో మాట్లాడొద్దు...

పొన్ మాణిక్కవేల్‌కు సుప్రీం ఆదేశం

అడయార్, మే 5 (ఆంధ్రజ్యోతి): విగ్రహాల అక్రమ రవాణా కేసులో రాష్ట్ర విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం మాజీ ఐజీ పొన్ మాణిక్కవేల్‌కు సుప్రీంకోర్టు ఓ షరతు విధించింది. ఈ కేసులో మీడియాతో మాట్లాడొద్దని ఆదేశించింది. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. విగ్రహాల అక్రమ రవాణా కేసులో పొన్ మాణిక్కవేల్‌కు కోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో సీబీఐ పిటిషన్ వేసింది. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపారు. పొన్ మాణిక్కవేల్ మీడియా ముందుకు వెళ్ళి సీబీఐకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, అందువల్ల ఆయన బెయిల్ రద్దుచేయాలని సీబీఐ తరపు న్యాయవాది కోరారు. ఇరు తరపు వాదనలు ఆలకించిన ధర్మాసనం.. ఈ కేసుకు సంబంధించి మీడియా ముందు ఎలాంటి వాఖ్యలు చేయొద్దని షరతు విధించింది.

డ్రగ్స్ కేసులో ఇద్దరు కీలక ఏజెంట్ల అరెస్టు

అడయార్, మే 5 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరానికి మాదకద్రవ్యాల సరఫరా (డ్రగ్స్ కేసు)లో కీలకంగా భావిస్తున్న ఇద్దరు ఏజెంట్లను నగర పోలీసులు ఢిల్లీలో అరెస్టు చేశారు. వీరిలో ఒకరు ఆఫ్రికా దేశస్థుడు కావడం గమనార్హం. వీరిద్దరినీ ఢిల్లీలో అరెస్టు చేశారు. వీరి నుంచి 15 గ్రాముల కొకైన్, 7 గ్రాముల హెరాయిన్, రూ.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ చెన్నై పోలీస్ పరిధిలో సాగుతున్న మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక పోలీస్ విభాగాన్ని ఏర్పాటుచేశారు. ఈ బృందం డ్రగ్స్ ఏజెంట్లు, వ్యాపారులు, సరఫరా చేసేవారి పనిపడుతోంది. ఈ క్రమంలో మార్చి 9వ తేదీ వైట్స్ సాలైలో డ్రగ్స్ విక్రయిస్తున్న విగ్నేశ్వరన్, బాలచంద్రన్, యువరాజ్, సోహైల్, ప్రవీణ్ అనే వారిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని విచారించగా మరో ఐదుగురు నైజీరియన్లను అరెస్టు చేశారు. వీరంతా ఇచ్చిన సమాచారం మేరకు ముఖ్యమైన ఏజెంట్ ఢిల్లీలో ఉన్నట్టు పోలీసులకు తెలిసింది.. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆఫ్రికా దేశానికి చెందిన కొట్టిజవరి (39), అతని అసిస్టెంట్ ఢిల్లీకి చెందిన రాహుల్ (19) అనే వారిని అరెస్టు చేశారు.

కావేరి పరివాహక ప్రాంతాల్లో కుండపోత...

హొగెనేకల్ జలపాతానికి పెరిగిన ఇన్‌ఫ్లో

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కావేరి నది పరివాహక ప్రాంతాల్లో కుండపోతగా వర్షాలు కురవటంతో ధర్మపురి జిల్లాలోని హొగెనేకల్ జలపాతంలో నీటి ఉధ్రుతి పెరిగింది.. వారం రోజులకు ముందు ఆ జలపాతంలోకి సెకనుకు 2వేల ఘన పుటడుగుల చొప్పున జలాలు ప్రవేశించాయి. ప్రస్తుతం ఒకేసారి ఇన్‌ఫ్లో పెరిగింది. ఆదివారం మధ్యాహ్నం నుండి సోమవారం వేకువజాము వరకు రాష్ట్రంలోని కావేరి పరివాహక ప్రాంతాలైన అంజెట్టి, కేరట్టి, నాట్రాంపాళయం, రాశిమణల్ తదితర ప్రాంతాల్లో కుండపోతగా వర్షాలు కురవటంతో ఈ జలపాతంలోకి ప్రవేశిస్తున్న జలాల పరిమాణం 5 వేల ఘనపుటడుగులకు పెరిగింది. అన్ని ప్రాంతాల్లోనూ జలకళ సంతరించుకోవటంతో పర్యాటకులు కూడా వేల సంఖ్యలో తరలివచ్చారు. లైఫ్‌జాకెట్లు ధరించి పర్యాటకులు దోనెల సవారీ చేయడానికి బారులు తీరారు. ఇదిలా ఉండగా కావేరి వాగులో క్రమంగా నీటి ఉధ్రుతి పెరుగుతుండటంతో బిలిగుండ్లు వద్ద కేంద్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు.


పొంగి ప్రవహిస్తున్న హొగెనేకల్ జలపాతం

విద్యార్థులు దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలి

- ప్రముఖ వ్యాపారవేత్త సత్యనారాయణరావు

ప్యారీస్, మే 5 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ పౌరులుగా విద్యార్థులు ఎదగాలని రాయల్ మార్కెటింగ్ సిమెంట్స్ అధినేత సత్యనారాయణరావు సూచించారు. అయినావరం రైల్వే క్వార్టర్స్ ప్రాంగణంలోని రక్షణ సైన్యం సంఘంలో నిర్వహించిన నాలుగు రోజుల వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. సంఘ ప్రాంగణంలో కోర్ కమాండింగ్ ఆఫీసర్లు ఎం.ఇమ్మానుయేలు-నివేదిత పర్యవేక్షణలో సాగిన ఈ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు దేశభక్తి, రక్షణ సైన్యం సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక, సాంఘిక కార్యక్రమాలు వివరించారు. ముగిం పు రోజున విద్యార్థులకు, టీచర్లకు ముఖ్యఅతిథి సత్యనారాయణరావు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. సంఘ పెద్దలు సూరిపోగు థామస్, చల్లగాలి నోవా, బలభద్ర సుమన్, సాల్మన్, జి.ప్రభుదాస్, ఎ.చిరంజీవి, ఎం.రమేష్, పి.పురుషోత్తం, తారా ఊర్మిలా, ఆరోగ్యమేరీ, ఎం.ఉమ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో సత్యనారాయణరావు తదితరులు


చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సాంకేతిక శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్‌లను సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న వెస్ట్రన్ ఆస్ట్రేలియా యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ డయానా స్మిత్ కేంటర్, వైస్‌ఛాన్సలర్ జెన్నిఫర్ హోవెల్


తేని జిల్లాలోని అన్నా సహకార నూలు మిల్లును సోమవారం పరిశీలిస్తున్న చేనేత, జౌళి శాఖ మంత్రి ఆర్.గాంధీ, తేని ఎంపీ తంగ తమిళ్ సెల్వన్, ఎమ్మెల్యేలు ఎ.మహారాజన్ (ఆండిపట్టి), కేఎస్ శరవణ కుమార్ (పెరియకుళం), జిల్లా కలెక్టర్ రంజిత్ సింగ్ తదితరులు


గిరివలంలో కేఆర్ నాగరాజన్

గిరివలం మార్గంలో రక్షణ కంచె

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలోని అరుణాచల పర్వతం చుట్టూ ఉన్న 14 కి.మీటర్ల గిరివలం మార్గంలో రక్షణ కంచె ఏర్పాటైంది. భారతదేశంలోని సాంప్రదాయ, సాంస్కృతిక ధోతి ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ అయిన రామ్‌రాజ్ కాటన్.. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని రూ.35 లక్షలతో ఈ కంచెను ఏర్పాటు చేసింది. దీని గురించి సంస్థ వ్యవస్థాపకులు చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ.. పవిత్ర స్థలాలను రక్షించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, ఈ ప్రాజెక్టు ద్వారా తాము ఆధ్యాత్మిక శ్రేయస్సు, వ్యవసాయ భద్రత పర్యావరణ సమతుల్యతను ఒక చోట చేర్చామన్నారు. ఈ కంచె యాత్రికులను కాపాడుతుందని, అంతేగాకుండా రైతుల పొలాలకు కూడా రక్షణ కల్పిస్తుందని వివరించారు.

శేషవాహనంపై సుబ్రహ్మణ్యుడి చిద్విలాసం


శేషవాహనంపై దర్శనమిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

తిరుత్తణి, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ క్షేత్రంలో గురువారం నుండి చిత్తిరై బ్రహ్మోత్సవాలను ధ్వజారోహణంతో ప్రారంభించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు వళ్ళీ, దేవసేన సమేతుడై సుబ్రహ్మణ్య స్వామివారు వెండి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పది రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో సుబ్రమణ్యస్వామి వారు ఐదోరోజైన సోమవారం శేషవాహన సేవలో స్వామివారు దేవేరులతో దేదీప్యమానంగా వెలిగిపోయాడు.

మాజీ ఐఏఎస్ అధికారికి భద్రత ఇవ్వరా?

- పోలీసు శాఖపై మదురై కోర్టు ఆగ్రహం

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): మదురై పరిసర ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీల్లో జరిగిన అవినీతి అక్రమాలను వెలుగులోకి తెచ్చిన మాజీ ఐఏఎస్ అధికారి సహాయంకు భద్రత ఎందుకు కల్పించలేదని మదురై జిల్లా ప్రత్యేక కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో రాష్ట్ర పోలీసు శాఖ తటపటాయిస్తే కేంద్ర ప్రభుత్వ భద్రతకు ఆదేశాలిస్తామని కూడా హెచ్చరించింది. గ్రానైట్ క్వారీల అవినీతిపై విచారణ జరుపుతున్న మదురై జిల్లా ప్రత్యేక కోర్టులో జరిగిన రెండు విచారణలకు సహాయం హాజరు కాలేకపోయారు. తనకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిరచే భద్రతను వెనక్కి చేసుకుందని, తన ప్రాణాలకు ముప్పువాటిల్లే అవకాశం ఉండటం వల్ల విచారణకు హాజరుకాలేకపోతున్నానని తన న్యాయవాది ద్వారా తెలియజేశారు.


మాజీ ఐఏఎస్ అధికారి సహాయం

కారు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యేకి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన కారు

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా కొండయాన్‌పట్టి వద్ద సోమవారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో అన్నాడీఎంకే మాజీ శాసనసభ్యుడు సహా ముగ్గురు తీవ్రం గా గాయపడ్డారు. పుదుకోట జిల్లాలో మాజీ మంత్రి సి.విజయభాస్కర్ నాయకత్వంలో అన్నాడీఎంకే బూత్ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశంలో పాల్గొనేందుకు విజయభాస్కర్ కారు వెనుకే మాజీ ఎమ్మెల్యే నెడుంజెళియన్ మరో కారులో బయలుదేరారు. మాజీ ఎమ్మెల్యే కారు అదుపు తప్పి చేపలవ్యాపారి సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే రాసు, కారు డ్రైవర్ రమణి, చేపల వ్యాపారి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన వెళ్ళి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.